

నేడు యథావిధిగా స్పందన, జెకెసి

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ స్పందన హాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరుగుతుందని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికాశుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సెప్టెంబర్ 05న మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి జిల్లా కలెక్టర్‌కు తెలియజేయవచ్చని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాకినాడలో ఓటు ఉన్నట్టా.. లేనట్టా..

- పూర్తయిన ఓటరు జాబితా
- 24 వేలకుపైగా ఓట్ల తొలగింపు
- జగన్నాథపురంపైనే దృష్టి
- అయోమయంలో ఓటర్లు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఎన్నికల సంఘం ఆదేశాలతో కాకినాడ జిల్లాలో సమగ్ర ఓటు సర్వే సరవేగంగా సాగింది. అనుకున్న సమయానికి తుది ఓట్లర జాబితా ప్రక్రియ సిద్ధం కావాలన్న అధికారుల ఆదేశాలతో కాకినాడ జిల్లాలో ఇప్పటివరకు 60 వేలకు పైగా ఓట్లును అధికారులు తొలగించారు. ఓట్ల తొలగింపులో కాకినాడ అర్బన్ నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. కాకినాడ అర్బన్ నియోజకవర్గంలోనే సుమారు 24 వేలకు పైగా ఓట్లు తొలగించినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

సంచలనాలకు కేంద్రబిందువుగా మారిన కాకినాడ నియోజకవర్గం ఓట్లు తొలగింపులోనూ మరోసారి ప్రత్యేకతను చాటుకుంది. అటు రెవెన్యూ, ఇటు కార్పొరేషన్ అధికారులు కలిపి ఇప్పటి వరకూ తొలగించిన 24 వేల ఓట్లకుపైగా తొలగించిన ఓట్లులో తమ ఓటు ఉన్నట్టా..? లేనట్టా..? అని పలువురు ఓటర్లు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఒక్క నియోజకవర్గంలోనే 24 వేల ఓట్లు తొలగించడం వెనుక ఆంతర్యం ఏమిటో అన్నది ఇప్పుడు చర్చానీయాంశంగా మారింది.



ఓటరు జాబితా నిరంతర ప్రక్రియ

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో గత రెండు దఫాలుగా ఓట్ల తొలగింపు ప్రక్రియ జరిగింది. రెవెన్యూ అధికారులు గత సంవత్సరంలో చేపట్టిన సమయంలో 19 వేలకుపైగా ఓట్లు తొలగించారు. కార్పొరేషన్ అధికారులు చేపట్టిన సమయంలో ఇప్పటివరకూ 4 వేలకుపైగా ఓట్లు తొలగించడం జరిగింది. ఓటు ఉన్నా సరే తొలగించిన వారి ఓటును సరిచేసుకునే అవకాశం ఉంది. ఇది నిరంతర ప్రక్రియ. అక్టోబర్ నెలలో బూత్ స్థాయిలో ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచుతాం. ప్రతి ఒక్కరు అప్పుడు తప్పొప్పులు సరిచేసుకునే అవకాశం ఉంది.

- నాగ నరసింహారావు, కాకినాడ కమిషనర్.

200 పోలింగ్ బూతుల్లో కొనసాగిన ప్రక్రియ

కాకినాడ నియోజకవర్గంలో 1,80,000 పైగా ఓట్లరు ఉండగా, సుమారు నాలుగు లక్షల పైగా జనాభా ఉన్నారు. గతంలో 48 వార్డులతో ఉన్న నగరం 50 వార్డులకు పెరిగింది. అయితే నగర పాలక సంస్థ ఎన్నికల్లో 48 వార్డులకే ఎన్నికలు నిర్వహించారు. 2024 ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తుది వాటర్ల జాబితా సిద్ధం చేసేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. ఈ ప్రక్రియను చేపట్టేందుకు 2022 నుంచే ప్రణాళిక సిద్ధం చేశారు. గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి మూడు నెలల పాటు, 2023లో జూన్ నెల నుంచి మొదలైన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా సుమారు 200 బూత్ లెవెల్ పరిధిలో సుమారు 25 వేలకు పైగా ఓట్లు తొలగించారు.



గతంలో ఓటరు జాబితా సిద్ధం చేస్తున్న అధికారులు (ఫైల్ ఫోటో)

ఈ విధంగా తొలగించారట..!

కాకినాడ నగరం ఎంతోమందికి నివాసయోగ్యంగా మారింది. పలు ప్రాంతాల నుంచి ఇక్కడ స్థిరపడినవారు, ఎన్నో సంవత్సరాల నుంచి జీవనం సాగిస్తున్న వారు, ఓకేడోర్ నెంబర్‌పై ఓటర్లు జాబితాలో ఉన్నవారు ఎంతోమంది ఉన్నారు. ప్రస్తుతం చేపట్టిన ఓటర్ల సమగ్ర సర్వేలో ఇల్లు మారినా, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినా, మృతి చెందినా, వివాహం జరిగిన వారిని గుర్తించి ఆయా విభాగాల వారీగా అధికారులు ఓట్లను తొలగించే ప్రక్రియను చేపట్టారు. ఇక్కడ విశేషమేమంటే ఒకే ప్రాంతంలో ఒక ఇంటి నుంచి మరొక ఇంటికి మారిన ఓటర్లను తొలగించడం చర్చానీయాంశంగా మారింది. ఉదాహరణకు జగన్నాథపురంలోని రామారావు పేట ప్రాంతానికి చెందిన ఒక ఇంటిలో ఉన్న ఓటరు అదే ప్రాంతంలో పది ఇల్లులు దాటిన తరువాత ఇంటిలోకి మారాడు. ఇదే అదునుగా భావించిన అధికార యంత్రాంగం ఇల్లు మారిన కారణాన్ని చూపి ఆ ఓటర్‌ను జాబితా నుంచి తొలగించారు. అలాగే ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతానికి వెళ్లిన ఓటర్‌ను సైతం తొలగించడం ఇక్కడ విశేషం. ఇలా చెప్పుకుంటూ పోతే నియోజకవర్గంలో జగన్నాథపురంలోనే ఎక్కువ ఓట్లు తొలగించారని విశ్వసనీయవర్గాల సమాచారం. ఒక్క జగన్నాథపురంపైన ఎందుకు ప్రత్యేక దష్టి సారించి ఓట్లను తొలగించారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకే ప్రాంతంలో ఇళ్ల మారిన ఓటర్లను తొలగించడం, వారిని మరోసారి ఓటు హక్కు కల్పించమని దరఖాస్తు చేసుకోమనడం వంటి ప్రక్రియను చేపట్టడం ఓటర్లను అయోమయంలోకి నెట్టడమే సరికాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తొలగించిన 24 వేలకుపైగా ఓటర్లలో ఎవరు ఉన్నారు..? ఎవరి ఓటు తొలగిపోయిందనేది తెలుసుకోవాలంటే అక్టోబర్ వరకు ఆగాల్సిందే.


పోరాటాలతోనే ఎదిగిన యుటిఎఫ్

ప్రజాశక్తి-కాకినాడ

పోరాటాల ద్వారా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వల్లనే రాష్ట్రంలో అతిపెద్ద సంఘంగా యుటిఎఫ్ ఆవిర్భవించిందని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో ఆదివారం ఉద్యమ శిక్షణా తరగతులు యుటిఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. యుటిఎఫ్ సంఘ విశిష్టత అంశంపై ఎంఎల్‌సి ఐవి మాట్లాడారు. ప్రస్తుత దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులపై ఎల్ఐసి నాయకులు సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రైవేటీకరణను ప్రోత్సాహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా పేదరికం వెంటాడుతూనే ఉందన్నారు. అంకెలు, ర్యాంకులు ప్రగతికి సూచిక కాదని, నిజంగా తలసరి ఆదాయం పెరుగడం ద్వారానే ప్రజల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. తెలిపారు. ఈ సంఘ వారసత్వం భవిష్యత్తు తరానికి అందించాలని కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా అధ్యక్షుడు నగేష్, ప్రధాన కార్యదర్శి చక్రవర్తి రాష్ట్ర కార్యదర్శి అన్నారాం, సుమారు 80 మంది కార్యకర్తలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికుల పోస్టర్ ఆవిష్కరణ


ప్రజాశక్తి - పెద్దాపురం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ క్లైయిములు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న మంత్రి దాడిశెట్టి రాజా ఇంటికి కార్మికులు జరిపే సామూహిక రాయబారాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో నాయకులు నీలం శ్రీను మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులకు కష్టాలు పెరిగాయన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రారంభించిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిర్వీర్యమైందన్నారు. పెండింగ్ క్లైయిముల అనేకం పరిష్కరించలేదన్నారు. భవన నిర్మాణ రంగంలో దాదాపు 25 లక్షల మంది కార్మికులు జీవిస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ 14న మంత్రి దాడిశెట్టి రాజా ఇంటికి రాయబారాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గడిగట్ల సత్తిబాబు, ఉపాధ్యక్షులు చింతల సత్యనారాయణ, కరణం అప్పారావు, గడపా వీరబాబు, యాసలపు మహేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

టిటిడి సభ్యునిగా ఎంఎల్ఎ పొన్నాడ ప్రమాణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడివరం ఎంఎల్ఎగా పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆదివారం ఉదయం 10.26 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా ప్రమాణ స్వీకారం చెయ్యడం తాను ఏనాడో చేసుకున్న పుణ్యం అన్నారు. జీవితంలో ఇంత మంచి అవకాశం వస్తుందని కలలోనైనా ఊహించలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. టిటిడి చైర్మన్ కరుణాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ సతీష్ కుమార్ కుటుంబసభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



తిరుమలలో కుటుంబ సభ్యులు, వైసిపి నాయకులతో ఎంఎల్ఎ పొన్నాడ

శ్రీ ప్రకాష్‌లో జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రశాంతంగా జరిగాయి. కాకినాడ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ స్విమ్మింగ్ పోటీల్లో సుమారు వందమంది బాల, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 56 కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ముఖ్య అతిథులుగా శ్రీప్రకాష్ స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్, స్విమ్మింగ్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షులు పెద్దిరెడ్డి సతీష్, అసోసియేషన్ సెక్రటరీ ఇరుసుమళ్ల రాజు, స్విమ్మింగ్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు మంగా వెంకట శివరామకృష్ణ పాల్గొన్నారు. ఈ పోటీలకు కోచ్‌లుగా శ్రీహరి, పి.నాని, ఎం.అజయ్ కుమార్, వి.వీరభద్రయ్య, ఐ.వీరబాబు వ్యవహరించారు. పోటీలు ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



పోటీల్లో పాల్గొన్న బాల బాలికలు

విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా బింధుమాధవి

ప్రజాశక్తి-జగ్గంపేట

జిల్లా స్థాయి సివిల్ సప్లైస్ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా జగ్గంపేట జెడ్‌పిటిసి ఒమ్మి బింధు మాధవీరఘురామ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా పరిషత్ చైర్మన్ కో చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ వైస్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో ఎంపీలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు, ఈ కమిటీలో బిందుమాధవికి అవకాశం కల్పించారు. ఈ కమిటీలో మరో ముగ్గురు జెడ్‌పిటిసిలు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రధానంగా నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ చట్టం పరిధిలో ఉన్న అన్ని రకాల స్కీమ్స్ సమర్థవంతంగా అమలవుతున్నాయో లేదో పర్యవేక్షించడం, నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ చట్టంలోని ప్రొవిజన్స్ కి విరుద్ధంగా ఏదైనా జరిగితే వ్రాత పూర్వకంగా జిల్లా స్థాయి అధికారులకు తెలియజేయడం, ఎక్కడైనా అవినీతి జరిగినా,చట్ట విరుద్ధంగా చర్యలకు పాల్పడినా వాటిపై ఫిర్యాదు చేయడం వంటి విధులు ఉంటాయి. బింధుమాధవి మాట్లాడుతూ తన నియామకంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్, పార్టీ పెద్దలకు, కలెక్టర్, జెడ్‌పి చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



జెడ్‌పిటిసి బిందుమాధవీరఘురామ్

ఉత్సాహంగా సిపిఎం సమరభేరి ప్రచారం

ప్రజాశక్తి-కాకినాడ, సామర్లకోట రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం చేపట్టిన సమరభేరి ప్రచారం ఆదివారం ఉదయం మెయిన్ రోడ్డు మార్కెట్‌లో నిర్వహించారు. మార్కెట్‌కు వచ్చిన ప్రజలు సిపిఎం ప్రచారాన్ని ఆదరిస్తూ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ ఆచరణలో అమలు చేయలేదు సరికదా ఉన్న ఉపాధిని దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆదాయాలు అంతంతమాత్రంగా ఉంటే నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజలు ఉపయోగించిన విద్యుత్ కంటే బిల్లులలో రకరకాల ఛార్జీల పేరుతో భారాలు వేస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ షరతులకు లోబడి స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారని ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. సెప్టెంబర్ 4న ఉదయం 10 గంటలకు కాకినాడ అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు, దుంపల ప్రసాద్, కె.నాగజ్యోతి, సిహెచ్.సతీష్, సూరిబాబు, ఆదర్శ్, జయరాం పాల్గొన్నారు.



సామర్లకోట బల్ల మార్కెట్లో ప్రచారం

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి


కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని పలువురు డిమాండ్ చేశారు. సిపిఎం సమరభేరిలో భాగంగా ఆదివారం సుందరయ్య భవన్‌లో నిరుద్యోగులతో సమావేశం నిర్వహించారు. కె.దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో న్యాయ విద్య పూర్తి చేసిన దివాకర్ మాట్లాడుతూ దేశంలో యువశక్తికి లోటు లేదన్నారు. వారికి తగిన ఉపాధి కల్పించి, దేశ సంపద సృష్టికి ఉపయోగించుకోవాలన్నారు. యువతను ప్రక్కదోవ పట్టించే పద్ధతులను రూపుమాపడానికి పాలకులు చిత్తశుద్ధిగా కషి చేయాలన్నారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పినా యువశక్తి సక్రమంగా ఉపయోగించడం లేదన్నారు. రాష్ట్రంలో కూడా సచివాలయాలు తప్ప పోలీసు, విద్యా తదితర ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు తగ్గించి, ఆ పోస్టులు అర్హులైన నిరుద్యోగులతో నింపాలని, యువతకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు 200 రోజులకు పెంచి, రోజుకి 600 రూ. చెల్లించాలని, పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సూరిబాబు, వరహాలు, జయరాం, సూర్య, ఆదర్శ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. సామర్లకోట పట్టణంలో నిర్వహించిన ప్రచారంలో సిపిఎం జిల్లా నాయకుడు కరణం ప్రసాదరావు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ ఆచరణలో అమలు చేయలేదు సరికదా ఉన్న ఉపాధిని దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆదాయాలు అంతంతమాత్రంగా ఉంటే నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో ప్రజలు ఉపయోగించిన విద్యుత్ కంటే బిల్లులలో రకరకాల చార్జీల పేరుతో భారాలు వేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శాఖకార్యదర్శి శ్రీనివాసరావు, యువజన సంఘ నాయకులు సయ్యపురెడ్డి నరసింహారాజు, సిఐటియు పట్టణ కార్యదర్శి నరవ సురేష్ కుమార్, చల్లా మహేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.



కాకినాడ మార్కెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బృందం



కాకినాడ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు





జాబితాలను పరిశీలిస్తున్న సిబ్బంది

ఓటర్ల జాబితాలో బిఎల్‌ఒలు బిజీ...

ప్రజాశక్తి - తాళ్లరేవు

రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణలో బిఎల్ఒలు బిజీ అయ్యారు. ఓటర్ల జాబితాల పరిశీలన కార్యక్రమంలో సెలవు రోజైన ఆదివారం కూడా వారు జాబితాలను పరిశీలించారు. తహశీల్దార్ ఎస్.పోతురాజు ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితా పరిశీలనా కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలను కూలంకషంగా పరిశీలిస్తున్నారు.

పోలిశెట్టి తాతీలుకు సన్మానం

ప్రజాశక్తి -కరప

కరప గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు 87 సార్లు రక్తదానం చేసినందుకు ఆదివారం ఘనంగా సత్కరించారు. పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన రక్తదానశిబిరంలో తాతీలు 87వ సారి రక్తదానం చేశారు. పెదపూడి మండలం కాంద్రేగుల గ్రామంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో జనసేన పార్టీ అనపర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, నాగిరెడ్డి వీరాస్వామి ఆయనను ఘనంగా సన్మానించారు.

శ్మశాన వాటిక కేటాయించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోటలో 4, 2, 16, 17 వార్డులలో నివసిస్తున్న దళితులకు ఏళ్ల తరబడి సరైన శ్మశాన వాటికలు లేవని, వెంటనే స్థలం కేటాయించాలని నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు కాతేటి అరుణ్ కుమార్ తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి శ్మశాన వాటిక లేకుండా ఇబ్బంది పడుతున్నా ఈ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నేటికీ ఏలేరు కాలువ గట్లపై మృతదేహాలకు అంత్యక్రియలు చేయాల్సిన దుస్థితి ఉందన్నారు. సిఎం వైఎస్.జగన్ ఇచ్చిన జిఒ నెంబర్ 142 అనుసరించి సామర్లకోటలో దళితులకు వెంటనే శ్మశాన వాటికలు కేటాయించాలని ఇటీవల కలెక్టర్‌కు స్పందనలో విన్నవించామన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో కాతేటి అరుణ్ కుమార్, చంద్రమల్లె సురేష్, వేళంగి సత్తిబాబు, పెనుమత్స చంద్రకాంతం, సిర్రా రవి పాల్గొన్నారు.

టిడిపి గత మేనిఫెస్టోకే దిక్కు లేదు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

టిడిపి గత ప్రభుత్వంలో మానిఫెస్టోలో అమలుపరిచిన సంక్షేమ పథకాలకే దిక్కులేదు కా ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాఉ అమలు చేస్తారా అని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు ప్రశ్నించారు. స్థానిక రమణయ్యపేట వైసిపి కార్యాలయంలో ఆయన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ఏనాడైనా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకున్నాడా అని ప్రశ్నించారు. చంద్రబాబు నమ్మిన ప్రజలను మోసం చెయడంలో దిట్ట అన్నారు. సూపర్ సిక్స్ ద్వారా లాస్ట్ బాల్ వేస్తున్నారని, బౌండరీలో తప్పక దొరకిపోతాడని వ్యాఖ్యానించారు. రూ.118 కోట్ల అవినీతి సొమ్ము రెండు కంపెనీల నుంచి చంద్రబాబుకు మళ్లించారని అన్నారు. కోర్టులను అడ్డుపెట్టుకొని వ్యవస్థలను భ్రష్టు పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. చంద్రబాబు నీతిమంతుడు అయితే ఇన్కమ్ టాక్స్‌పై పరువు నష్టం దావా వెయ్యాలి కదా అన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కన్నబాబు

చంద్రబాబుకు నోటీసుల వెనక వైసిపి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

టిడిపి అధినేత చంద్రబాబుకు పాత ఐటి నోటీసు వెనకాల వైసిపి లాబీయింగ్ ఉందని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం వారు వలసపాకలల తమ నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. నగదు లావాదేవిలు జరగని ఈ కేసులో ఐటీ ఇచ్చిన నోటీసులకు చట్టబద్ధత లేదన్నారు. చంద్రబాబు ఇమేజిని తగ్గించాలని చూస్తున్నారని, డబ్బు ఎక్కడా చేతులు మారానప్పుడు ఐటి నోటీసులు ఇచ్చే అవసరం ఏముందని ప్రశ్నించారు. చంద్రబాబు నీతి నిజాయితీపై వైసిపి ప్రభుత్వం బురద జల్లుతోందని మాజీ ఎంఎల్ఎ అనంతలక్ష్మి సత్తిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.



సమావేశంలో పాల్గొన్న ఎఐసిసి సభ్యులు

ఎఐసిసి ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యాన విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఎఐసిసి సర్వసభ్య సమావేశం కాకినాడ రూరల్, రాయుడుపాలెం సిసిసి ప్రాంగణంలో ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ స్టీఫెన్ ఆనంద్ అధ్యక్షతన, అధ్యక్షుడు రిక్కీ గూటమ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఐసిసి ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమలు దిగ్విజయంగా నిర్వహించామన్నారు. గత నెల 19న సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ద్వారా కాకినాడ జిల్లావ్యాప్తంగా 11 వేలకు పైగా వివిధ రకాల పండ్ల జాతుల మొక్కలు పంపిణీ చేశామన్నారు. ముున్ముందు ఎఐసిసితో కలసి పనిచేయడానికి ఎంఎల్ఎ, కలెక్టర్ సుముఖత వ్యక్తం చేయడం తమకెంతో ప్రోత్సాహాన్ని, ఆనందాన్నిచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి కాకినాడ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో బాటు కోశాధికారి రెవరెండ్ పాల్ రాజ్‌కమల్, ఎన్.సామ్యూల్ జోసెఫ్, రెడ్డి అంకిత్ స్టీఫెన్, టిజి.సుధీర్, ఎస్.సౌమ్య సుమలత, ఆషేర్ స్టాన్లీ, ఎస్ఇ.ప్రశాంత్ కుమార్, రూపస్ కుమార్, డి.చార్లెస్, ఎం.ధర్మపాల్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మోటార్ సైకిళ్ల దొంగల అరెస్ట్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తాళాలు వేసి ఉన్న మోటారు సైకిళ్లను అర్ధరాత్రి సమయంలో అపహరించుకుపోతున్న దొంగలను సిసి కెమెరాల ఆధారంగా ఇంద్రపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కొంతకాలంగా ఇంద్రపాలెం, చీడిగ, రేపూరు, కొవ్వాడ గ్రామాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. చోరీ చేసిన మోటార్ సైకిళ్లను ఆదివారం తెల్లవారుజామున కాకినాడ మెయిన్ రోడ్డులోని మార్కెట్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. విచారణ చేపట్టి నిందితులపై కేసును నమోదు చేసి కఠినంగా చర్యలు చేపట్టాలని బాధితులు పోలీసు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

పోలవరం కాలువలో మహిళ మృతదేహం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రామవరం గ్రామంలో పోలవరం కాలువ పంప్ హౌస్ లాకుల వద్ద ఆదివారం ఒక మహిళ మృతదేహం లభ్యమయింది. కిర్లంపూడి ఎస్ఐ ఉమా మహేశ్వరరావు తెలిపిన వివరాలివి. బూరుపూడి గ్రామానికి చెందిన కరణం రమాదేవి (26) భర్త మద్యానికి బానిసవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోందన్నారు. రమాదేవికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమాదేవి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.


ధ్వంసమైన బోటు

రాళ్లను ఢీకొని బోటు బోల్తా...

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

అమీనాబాద్ రేవు వద్ద రాళ్లను ఢీకొని బోటు బోల్తా పడడంతో బోటు ధ్వంసమై సుమారు రూ.పది లక్షల ఆస్తి నష్టం వాటిలినట్లు బోటు యజమాని తెలిపారు. ఉప్పాడకు చెందిన కారే చిన్నబ్బాయికు చెందిన బోటుపై శనివారం కొంతమంది మత్స్యకారులు వేటకు వెళ్లారు. వేట ముగించుకుని సాయంత్రం వచ్చి అమీనాబాద్ రేవు వద్ద బోటుకు లంగర్ వేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి. బోటు మొత్తం ధ్వంసం అయి ఉంది. మినీ హార్బర్ ఏర్పాటుకు ఇటీవల సముద్రానికి అడ్డుగా రాళ్ళు వెయ్యడంతో అలల ఉధతి ఎక్కువగా ఉండడంతో లంగర్ తాడు తెగి బోటు వెళ్లి రాళ్ల గట్టును ఢీకొట్టింది. దీంతో బోటు ధ్వంసమైందని స్థానిక మత్స్యకారులు తెలిపారు. ధ్వంసమైన బోటును జెసిబి సహాయాలతో ఒడ్డుకు తీసుకువచ్చారు. ఇటీవల కాలంలో అమీనాబాద్ రేవు వద్ద అలల ఉధతికి ఎన్నో బోట్లు ధ్వంసమయ్యాయి దీన్ని గమనించి బోట్లు ధ్వంసం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-కాట్రేనికోన

కందికుప్ప గ్రామ శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని సమాచారంతో ఎస్ఐ టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి రూ.55,500 నగదును మరియు 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరో నలుగురు నిందితులు పేకాట శిబిరం నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఐ పోలవరం

కొమరగిరి 216వ జాతీయరహదారి పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లంక సురేంద్ర వంశీశ్రీ(21) మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలుఇవి.. యానాం నుంచి బైక్ మీద ఇంటికి వెళుతుండగా కొమరగిరి ఇటుకల బట్టి సమీపానికి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ఆటోని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న సురేంద్ర వంశీశ్రీ మృతి చెందినట్లు ఐ.పోలవరం ఎస్ఐ సి హెచ్.రాజేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-అమలాపురం

ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో ఆదివారం వ్యక్తి మృతి చెందాడు. అల్లవరం మండలం సామంతకుర్రు గ్రామంలో చెరువులో ఏరియేటర్లు మరమ్మతులకు గురికావడంతో రిపేరు చేస్తున్న సమయంలో పొలం లో పని చేస్తున్న సుంకర త్రిమూర్తులు ఏరియేటర్ పైకి లేపడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి అల్లవరం పోలీసులు చేరుకుని కేసు విచారణ చేస్తున్నారు.



అదుపుతప్పి పక్కకు ఒరిగికిపోయిన ఆర్‌టిసి బస్సు

అదుపు తప్పిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి-అయినవిల్లి

తొత్తరమూడి రోడ్డులో ఆర్‌టిసి బస్సు అదుపుతప్పి కొబ్బరి తోటలోకి ఒరిగిపోయిన తొత్తరముడి లో చోటుచేసుకుంది. వివరాలు ఇవి.. మురముళ్ళ నుంచి వయా ముమ్మిడివరం, తొత్తరమూడి మీదుగా రావులపాలెం వెళుతున్న బస్సు తొత్తరమూడి వద్ద గుంతలు ఏర్పడి రోడ్లు సరిగా లేకపోవడంతో అదుపుతప్పి కొబ్బరి తోటలోకి ఒరిగిపోయింది. దీంతో కొబ్బరి చెట్లు అడ్డు రావడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి

జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి



ముఖాముఖి

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా జిల్లాలోని అన్ని పంచాయితీల్లో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలు పైనే ప్రధానంగా దృష్టి సారించామని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పంచాయితీ అధికారి కృష్ణకుమారి అన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించి కొన్ని కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు తీసుకంటున్నారు.

జిల్లాలోని అన్ని పంచాయితీల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, డ్రైనేజీల క్లీనింగ్ కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగించేందుకు ప్రభుత్వం 'మనం మన పరిశుభ్రత' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం పై ప్రత్యేక దష్టి సారించాము. ప్రతి గ్రామంలో కూడా క్లాప్ మిత్రల సహాయంతో ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టాము.

తాగు నీటి సరఫరాపై ఎటువంటి చర్యలు చేపట్టారు.

జిల్లాలో వేసవికాలంలో తప్ప తాగునీటి సమస్య పెద్దగా లేదు. గ్రామాల్లో తాగునీటి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ఆర్డబ్ల్యూఎస్ సహకారంతో సిపిడబ్ల్యూఎస్ స్కీమును జిల్లాలో పలు గ్రామాల్లో అమలు చేస్తున్నాము. ఈ పథకం ద్వారానే జిల్లాలోని అమలాపురం మండలం పేరూరు చిందాడగరువు గ్రామాల నుండి పైప్ లైన్లు ద్వారా 30 గ్రామాలకు పైగా తాగునీటి ని అందిస్తున్నాం.

అలాగే పిడబ్ల్యూఎస్ స్కీం లో భాగంగా పంచాయతీలోనే మోటర్ల ద్వారా భూగర్భ జలాలు తోడుకొని వాటిని శుద్ధి చేసి త్రాగునీరు అందించడం జరుగుతుంది.గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ పెద్దలు, వార్డు సభ్యుల సహకారంతో గ్రామ సభలు జరిపి జల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాం. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ త్రాగు నీటి వనరులను సంరక్షించుకోవాలని పిలుపునివ్వడం జరిగింది. క్షేత్రస్థాయిలో త్రాగు నీటి పైపులు మరమ్మతులు, మంచినీటి పథకం ట్యాంకులు పరిశుభ్రత, త్రాగునీటి పరీక్షలు జరుపుతున్నాం. సచివాలయ సిబ్బంది ద్వారా ఇది నిరంతరంగా జరుగుతుంది.

పన్నుల వసూళ్లు ఎలా జరుగుతున్నాయి?

జిల్లాలోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివద్ధికి సహకరించాలి. పన్నుల రూపేణా జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 90 శాతం పన్నులు వసూలు అయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూలుకు డిమాండ్ నోటీసులు జారీ చేసే పనిలో సిబ్బంది ఉన్నారు. పన్నులను త్వరితగతిన వసూలు చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

వీధిలైట్ల నిర్వహణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

వీధి లైట్ల నిర్వహణ పట్ల కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఫిర్యాదులు కూడా చాలా ప్రాంతాల నుండి వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వెలగడం, మరికొన్ని ప్రాంతాల్లో వెలగక పోవడం, చాలా చోట్ల వెలుగుతూనే ఉండడం వంటి సమస్యలు వస్తున్న నేపథ్యంలో స్థానిక పంచాయితీ, సచివాలయ సిబ్బందే నిర్వహణ బాధ్యతలు చేపట్టి సమస్యలు పరిష్కరిస్తాం .విద్యుత్తు విడి పరికరాలు ప్రభుత్వం సరఫరా చేస్తుంది.వీధిలైట్లు సమస్యలు వచ్చిన వెంటనే పరిస్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

14, 15వ ఆర్థిక సంఘం నిధులను ఎలా ఖర్చు చేస్తున్నారు.

14వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి గడువుని ప్రభుత్వం మరో ఏడాది పాటు పెంచింది. 14వ ఆర్థిక సంఘం నిధులు ఫ్రీజ్ చేసి మళ్లీ రిలీజ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గైడ్ లైన్స్ ప్రకారం సిఎఫ్ఎంఎస్ విధానంలో ఖర్చు చేస్తాం. పంచాయితీలకు ఉన్న విద్యుత్తు బకాయిలను చెల్లించే విధంగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. మిగిలిన నిధులను గ్రామ పంచాయితీ అభివద్ధి ప్రణాళిక ప్రకారం త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యం నిర్వహణ, సిసి రోడ్లు బరేల్ గ్రౌండ్ ల అభివద్ధికి ఖర్చు చేయాల్సి ఉంది.

యానాం వార్తలు



ర్యాలీని ప్రారంభించిన ఆర్ఎఒ మునిస్వామి

డ్రీమ్స్ విద్యార్థుల స్వచ్ఛతా ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

యానాం డ్రీమ్స్ ఫౌండేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం స్వచ్ఛతా పఖ్వాడ ర్యాలీని నిర్వహించారు. స్థానిక పరిపాలనాధికారి మునిస్వామి ఆయన కార్యాలయం వద్ద ర్యాలీని ప్రారంభించారు.అనంతరం విద్యార్థులు యానాం పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. పచ్చదనం - పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శేరు వెంకట రమణ, మేనేజర్ గంగాధరవర్మ, ప్రధానోపాధ్యాయురాలు మాథ్యూస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న దొరబాబు

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

కట్టమూరులోని కేశవ పట్టాభి రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శంకుస్థాపన చేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ మాట్లాడుతూ పురాతనమైన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దేవస్థానం నిధులు రూ.10 లక్షలు, సర్వ శ్రేయోనిధి రూ.90 లక్షలు మొత్త రూ.కోటితో వ్యయంతో పునర్ నిర్మిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిర్యాల రాజా, సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, ఎంపిటిసిలు నల్లల సూర్య కుమారి, యు.ప్రసాద్, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఆలయ చైర్మన్ మేడిది వెంకట రామారావు, చల్లా చిన్న వీర్రాజు, బిక్కిన శేషవీర కుమారి, పెద్దింటి వెంకట నరసింహాచార్యులు, ఎలిశెట్టి నాని, ఏలేటి సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్‌బి.పట్నంలో ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయభూపాలపట్నంలో వినాయకుని ఆలయం వద్ద ఆదివారం జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరు దొరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రాజకీయ నాయకులు ముత్యాల రాజబ్బాయి, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఎండ్రు సత్తిబాబు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్య వజ్రాయుధం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, బాధ్యతగా వినియోగిస్తే సమాజానికి, భావితరానికి మేలు జరుగుతుందని యనమల రామం పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్ల వయసు నిండే యువతకు ఓటు నమోదు చేస్తున్నందున సద్వినియోగపరచుకోవాలని అన్నారు. ఓటర్ లిస్ట్‌లో తమ పేరు ఉందో లేదో తెలుసుకోవడం లేకపోతే ఓటు చేర్పించుకోవడం ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడి బాధ్యతన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యనమల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రామం



అలరించిన నృత్య నీరాజనం

అలరించిన నృత్య నీరాజనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చిన్నారులు చేసిన నృత్యాలతో కాకినాడ నగరం పులకించింది. సుమారు 650 మంది విద్యార్థులతో 42 నాట్యసంస్థలతో ఆనెం లక్ష్మణరావు నృత్యనీరాజనం ఘనంగా నిర్వహించారు. కాకినాడ దంటు కళక్షేత్రంలో నిర్వహించిన ఈ నృత్య నీరాజనం అలరించింది. నాట్యరంగంలో ప్రసిద్ధులైన నృత్య సమాఖ్య కాకినాడ అధ్యక్షులైన నాట్యాచార్య ఒవిఎన్.వరప్రసాద్, సేవారంగంలో ప్రపంచ తెలుగుసేన అధ్యక్షుడు పిఎస్ఎన్.మూర్తి, నాగపూర్, కళారంగానికి ప్రతీకగా ప్రముఖ రూపశిల్పి శ్రీరామును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు గట్టి సత్యన్నారాయణ, సిఎస్.మూర్తి, బుద్ధాల వెంకటరామారావు, లింగమల్లు కృష్ణమూర్తిగారు తదితరులు పాల్గొన్నారు. నత్యసమాఖ్య సభ్యులందరితో కలిసి అనేక మందికి నాట్యసంస్థలకు ప్రసాద్ అభినందనలు తెలిపారు.

టిడిపిలోకి మాజీ సర్పంచ్ నారాయణస్వామి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని వికె.రాయపురం మాజీ సర్పంచ్ కుర్రా నారాయణస్వామి (రాజు) సుమారు 200 మంది తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం రాత్రి కాకినాడ రూరల్ శివారు అచ్చంపేట వద్ద టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో రాజు తన అనుచరులతో టిటిపిలో చేరారు. రాజు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హాయంలో వికెరాయపురం సర్పంచిగా, సొసైటీ అధ్యక్షునిగా పనిచేశారు. గత ఎన్నికలకు ముందు టిడిపి వీడారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఉన్నారు.ఠ

ఉపాధ్యాయుడు దొరబాబుకు 'మెరిటోరియస్' అవార్డు

ప్రజాశక్తి-కడియం

దుళ్ల నెంబర్-1 ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయుడు దొరబాబు ఫిలంత్రోఫిక్ సొసైటీ ఇండియా వారు అందజేసే మెరిటోరియస్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరం ఎల్ఐసి ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం, కాకినాడ ఆర్‌జెడి నాగమణి, రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు చేతుల మీదుగా ఈ అవార్డును దొరబాబు అందుకున్నారు. ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల పట్ల అత్యధిక శ్రద్ధ కనపరుస్తూ, ఉత్తమ ఫలితాలు సాధించే ఉపాధ్యాయులను ఈ అవార్డుకు ఎంపిక చేస్తామని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఇండియా అధ్యక్షులు అద్దంకి రాజా తెలిపారు. అవార్డుకు ఎంపికైన మాస్టారును ఎంఇఒ లజపతిరాయ్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరు శ్రీనివాస్ మాస్టర్, ప్రధానోపాధ్యాయుడు గెడ్డం ఆనంద్, పిఎంసి ఛైర్మన్ గోపి వెంకటరామ బ్రహ్మం, గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, దుళ్ళ గ్రామ వైసిపి అధ్యక్షులు తాతపూడి బాబి తదితరులు అభినందించారు.



ఉపాధ్యాయుడు దొరబాబుకు పురస్కారం అందజేస్తున్న ప్రముఖులు


నియామక పత్రం అందిస్తున్న జివి.శ్రీరాజ్

జాబ్ మేళాకు 700 మంది హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని రాజీవ్ గాంధీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన మేగా జాబ్ మేళ లో వివిధ కంపెనీలకు సుమారు 700 మందికి పైగా విద్యార్థులు ఎంపికయ్యారు.

ఈ జాబ్ మేళాను విద్యా సంస్థల ఛైర్మన్ జివి హర్షకుమార్, టిడిపి నాయకుడు ఆదిరెడ్డి వాసు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసుత రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం కష్టతరమైనదని, అందుకే ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మంచి ప్రతిభను కనబరిచి ఉద్యోగం లో పని అనుభవం సంపాందించుకోవాలని సూచించారు. ఈ మెగా జాబ్ మేళా రాజీవ్ గాంధీ విద్యాసంస్థలతోపాటు జీజూమ్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ మెగా జాబ్ మేళలో ప్రముఖ కంపెనీలు విప్రో, గన్ ఫ్యాక్ట్, టెలి ఫేర్ఫార్మెన్స్, హైలెట్ టెక్నాలజీ, టేక్ వే సాఫ్ట్ వేర్, ముత్తూట్ గ్రూప్, త్రీజీ హైయర్ సర్వీస్, బిట్స్ సాఫ్ట్ సొల్యూషన్స్ తదితర 55 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ కళాశాల డైక్టర్లు జి.వి.శ్రీరాజ్, జివి సుందర్ పాల్గొన్నారు.

ముగిసిన జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన అమలాపురం మండల స్థాయి జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ ముగింపు వేడుకలు అమలాపురం స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ నందు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అమలాపురం ఆర్‌డిఒ వసంతరాయుడు మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం వల్ల చదువులో కూడా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అండర్-11, అండర్-13, అండర్-15 మూడు విభాగాలలో జరిగిన ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు అందరకూ ఆర్‌డిఒ అభినందనలు తెలియజేశారు. ఈ పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లతో పాటు బహుమతులను అందజేశారు. ఇటువంటి టోర్నీని విజయవంతంగా నిర్వహించిన కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధికారులకు, ఆఫీసర్ క్రియేషన్ క్లబ్ టీమ్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మెట్ల సూర్యనారాయణ, రంకిరెడ్డి విశ్వనాథ్, రంగమణి, పి.జాన్ పాల్, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పుత్సా కృష్ణ కామేశ్వర్, పి.రాజా, మాధవి, టి. సత్యనారాయణ రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఆర్‌డిఒ తదితరులు


పిడుగుపాటుకు కాలిపోయిన పాకలు

పిడుగుపడి రెండు గేదెల మృత్యువాత

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని అమజూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పిడుగుపాటుకు మూడు పాకలు పూర్తిగా కాలిపోయాయి. వాటిలో గల రెండు గేదెలు చనిపోగా, మరొక గేదె తీవ్ర గాయాల పాలైంది. ఈ పాకలు మేడిశెట్టి ప్రసన్న కుమార్, మేడిశెట్టి శివప్రసాద్‌కి చెందినవి. రామచంద్రపురం ఫైర్ సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3లక్షల30వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా.

మోటార్ సైకిల్ సీజ్.. వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మోటార్ సైకిల్ వేగంగా నడపడంతో పాటు సైలెన్సర్ లేకుండా రాత్రి సమయంలో బండిని నడిపి ప్రజలను భయభ్రాంతులను గురిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సంఘటన ర్యాలి గ్రామంలో చోటుచేసుకుంది వివరాలివి.. గ్రామానికి చెందిన మెర్ల సాయికృష్ణ శనివారం రాత్రి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా మోటార్ సైకిల్‌ను నిర్లక్ష్యంగా నడపడం, సైలెన్సర్ను తీసి వేగంగా వాహనాన్ని నడిపాడు. దీంతో సాయి కృష్ణపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గృహ విద్యుత్ వినియోగదారులకు, వ్యవసాయ వినియోగదారులకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ(ఆపరేషన్స్) ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ చర్యల్లో భాగంగా పరి శ్రమల విద్యుత విని యోగంపై పరిమితులు విధించనున్నామ న్నారు. సెప్టెంబర్ 5 నుంచి 15 వరకూ పరిశ్రమల విద్యుత్ సరఫరాలో లోడును నియంత్రి చనున్నామని తెలిపారు. కంటి న్యూస్ ప్రాసెస్ పరిశ్రమలు వాటి కాంట్రాక్టడ్ మాక్సిమం డిమాండ్ (సీఎండీ)లో 70 శాతం మాత్రమే వాడాలన్నారు. నాన్ కంటిన్యూస్ ప్రాసెస్ పరిశ్రమలు పగలు 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలవరకూ ఒక షిఫ్టును మాత్రమే కొనసాగించాల్సి ఉం టుందన్నారు. సోమవారం జగ్గం పేట డివిజన్, మంగళవారం కాకినాడ డివిజన్, బుధవారం, గురువారం పెద్దాపురం డివిజన్, శుక్రవారం రాజమహేంద్రవరం డివిజన్, అమలాపురం డివిజన్, రంపచోడవరం డివిజన్, శని వారం రాజమహేంద్రవరం అర్బన్ డివిజన్, రామచంద్రపురం డివి జన్‌లో లోడ్ రిలీఫ్ ఇస్తామన్నారు. సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరా సమాచారం మేరకు 1912, సంబంధిత అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్(ఆపరేషన్)ని సంప్రదించాలన్నారు. రాజమహేంద్ర వరం టౌన్ డివిజన్(7382299960, 9440812585), రాజమ హేంద్రవరం రూరల్ డివిజన్ (738258548, 9440812586), కాకినాడ డివి జన్(8333818099, 9440812589), పెద్దాపురం, జగ్గంపేట, అమలాపురం డివిజన్ (9440812588, 9440812587), రామచంద్రపురం డివిజన్, రంప చోడవరం డివిజన్ (7382585554) నెంబర్లను సంప్రదించాలన్నారు.